క్లుప్తంగా

నాయుడుతోటలో ఆధార్ కేంద్రం ఏర్పాటు



ఆధార్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రాపర్తి కన్నా

సింహాచలం: జీవీఎంసీ 93వవార్డు నాయుడు తోటలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా సోమవారం ప్రారంభించారు. ప్రజలంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఆధార్‌లో పేర్లు మార్పు, డోర్‌నెంబర్ మార్పు, ఆధార్ అప్‌డేట్, ఫోన్ నెంబరు యాడింగ్ లేదా అప్‌డేట్ తదితర సౌకర్యాలన్నీ అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఉమాచంద్రమౌళీశ్వరస్వామికి అభిషేకాలు



సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. స్వామికి బిల్వ పత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మ వారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.

బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడిగా మళ్ల



జగదీశ్వరరావు

ఉక్కునగరం: భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) జాతీయ ఉపాధ్యక్షుడిగా మళ్ల జగదీశ్వరరావు ఎన్నికయ్యారు. బిహార్ రాజధాని పాట్నాలో గత వారం జరిగిన బీఎంఎస్ 20వ త్రైవార్షిక మహాసభలకు దేశ వ్యాప్తంగా జాతీయ పదాధికారులు, కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర స్థాయి పదాధికారులు, కార్య వర్గ సభ్యులు సుమారు 2200 మంది హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన కార్య వర్గ సమావేశాల్లో దేశంలోని కార్మిక సమస్యలు, జాతీయ సమస్యలపై చర్చలు జరిగాయి. అనంతరం మూడేళ్ల కాలపరిమితితో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో మళ్ల జగదీశ్వరరావును మూడో సారి జాతీయ ఉపాధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను బీఎంఎస్ నాయకులు ఎం.వి.ఎస్. నాయుడు, రాందాస్ నరేంద్ర, లాలం ప్రసాద్, రొక్కం సురేష్‌కుమార్, ఎస్.ఆర్.సి. శేఖర్ అభినందించారు.

వాహనం ఢీ కొని యాచకుడి మృతి



యాచకుడి మృతదేహం

అక్కిరెడ్డిపాలెం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మతిస్థిమితం లేని ఓ యాచకుడు(40) మృతి చెందాడు. ఘటనకు సంబంధించి గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో తిరిగే మతిస్థిమితం లేని యాచకుడిని ఆటోనగర్ బీ బ్లాక్‌లో సోమవారం ఉదయం ఓ గుర్తు తెలియని వాహనం ఢీకొని, నడుము పైనుంచి దూసుకు పోయింది. ప్రమాదంలో యాచకుడు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. యాచకుడు ఒంటిపై టవల్ మాత్రమే కట్టుకొని సంచరిస్తుంటాడని స్థానికులు తెలిపారు. ఒడిశా ప్రాంతానికి చెందిన వాడిగా భావిస్తున్నామన్నారు. మృతుడిని ఎవరైనా గుర్తు పడితే, గాజువాక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ తెలిపారు.

ఏడాది గడవక ముందే..!

- పెచ్చులూడుతున్న ఊటగెడ్డ రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనచోదకులు



దెబ్బతిన్న ఊటగెడ్డ- వాడచీపురుపల్లి రోడ్డు

పరవాడ: ఆ రోడ్డు పనులపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాది గడవక ముందే ఎక్కడికక్కడ పెచ్చులూడిపోతుంది. వాహనదారులను ఇబ్బంది పెడుతోంది. దీంతో వాహనదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.రోడ్డు పనుల్లో నాణ్యత లోపించడం వల్లే దెబ్బతింటోందని ఆరోపిస్తున్నారు.

ఇదీ పరిస్థితి

ఊటగెడ్డ-వాడచీపురుపల్లి రహదారిలో ప్రయాణం నరకప్రాయంగా మారిందని ప్రయాణికులు వాపోతున్నారు. రహదారి దెబ్బతినడంతో ప్రయాణికులు, కార్మికులు, ఉద్యోగులు ప్రమాదాల బారిన పడుతున్నారు. లక్షలాది రూపాయలతో పది నెలల కిందటే రహదారిని అభివృద్ధి చేశారు. ఇనుము, బొగ్గు, సిమెంట్ వంటి అధిక బరువు కలిగిన భారీ వాహనాల రాకపోకలతో రహదారి ధ్వంసమవుతోంది. రహదారిని అభివృద్ధి చేసిన తరువాత రోడ్డు దెబ్బతినడంతో రెండు పర్యాయాలు రహదారికి మరమ్మతులు చేపట్టారు. మళ్లీ రహదారి పెచ్చులూడిపోయి గోతులుగా ఏర్పడింది. ఫలితంగా రాత్రి వేళల్లో ప్రయాణించే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఊటగెడ్డ-వాడచీపురుపల్లి రహదారిలో పెచ్చులూడుతున్న ప్రదేశాలను గుర్తించి మరమ్మతులు చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఇష్టానుసారంగా పార్కింగ్



లంకెలపాలెం రహదారిలో రోడ్డు పక్కన నిలిపిన భారీ వాహనాలు

పరవాడ: నిబంధనలకు విరుద్ధంగా రోడ్ల పక్కన నిలుపుతున్న భారీ వాహనాలతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. అయినా అధికారుల్లో చలనం రాలేదు. ముఖ్యంగా లంకెలపాలెం-పరవాడ, పరవాడ-వాడచీపురుపల్లి రహదారుల్లో బూడిద, బొగ్గు లారీలను ఎక్కడికక్కడ రోడ్ల పక్కన నిలిపేస్తున్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాంకీ కూడలి, మండల కాంప్లెక్సు, సినిమాహాలు కూడలి, ఊటగెడ్డ కూడలి, ఎన్టీపీసీ మెయిన్‌గేటు ప్రాంతాల్లో భారీ వాహనాలు రోడ్ల పక్కన నిలిపి లారీ సిబ్బంది టిఫిన్, భోజనాలకు వెళ్తున్నారు. దీంతో ప్రయాణికులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇదంతా కళ్లారా చూసినా ట్రాఫిక్ పోలీసులు నిమ్మకునీరెత్తి వ్యవహరించడం వల్ల లారీ డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి నిబంధనలకు విరుద్ధంగా లారీలు నిలుపుతున్న సిబ్బందిపై ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అప్పన్నకు పట్టు వస్త్రం బహూకరణ



పట్టువస్త్రంతో దేవస్థానం ఈవో, ప్రధానార్చకుడు, అధికారులు

సింహాచలం: ఈనెల 23న శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం పురస్కరించుకుని స్వామికి పట్టువస్త్రాన్ని నగరానికి చెందిన ఎం.రమాదేవి అనేదాత సోమవారం సమర్పించారు. ఏటా స్వామికి చందనోత్సవం రోజు సమర్పించే పట్టు వస్త్రాన్ని దేవస్థానం ఒడిశా రాష్ట్రంలోని బరంపురం సమీపంలోని పట్టుపురం గ్రామం నుంచి తీసుకురావడం సంప్రదాయంగా వస్తోంది. కొన్ని సంవత్సరాల నుంచి సంబంధిత పట్టువస్త్రాన్ని రమాదేవి ఒడిశా నుంచి తీసుకొస్తున్నారు. ఈ ఏడాది కూడా రూ. 80వేలు వెచ్చించి 120 మీటర్ల పట్టువస్త్రాన్ని తెప్పించారు. సింహగిరిపై స్వామివారి ఆలయంలో దేవస్థానం ఈవో వి.త్రినాథరావుకు సంబంధిత పట్టువస్త్రాన్ని ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు అందజేశారు. ఆలయ ఏఈవో శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ అప్పలనాయుడు, సిబ్బంది నాయుడు పాల్గొన్నారు.

క్లాప్ వాహనాల డ్రైవర్ల నిరసన



నిరసన తెలుపుతున్న డ్రైవర్లు

మర్రిపాలెం: జీవీఎంసీ పారిశుధ్య విభాగం క్లాప్ వాహనాల డ్రైవర్లు తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ మేరకు సోమవారం 53వ వార్డు మర్రిపాలెం ఆంధ్రకేసరి నగర్ శ్మశానవాటిక వద్ద నిలిపి ఉన్న క్లాప్ వాహనాల వద్ద నిరసన చేపట్టారు. తమకు కనీస జీతం రూ.18,500 ఇవ్వాలని, 2021లో విధుల్లోకి తీసుకున్న జీవీఎంసీ అధికారులు భవిష్యత్తులో రూ.18,500 చెల్లిస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇంతకాలం గడుస్తున్నా తమకు రూ.11 వేల మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. క్లాప్ వాహనాలు రోజు 31 కిలోమీటర్లు తిరగాలన్న అధికారులు.. ప్రస్తుతం కిలోమీటర్ల దూరాన్ని పెంచారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజా పోరాటాలతో కేంద్రానికి గుణపాఠం



ప్రచారంలో ప్రసంగిస్తున్న సత్యనారాయణ

గాజువాక: ప్రజా పోరాటాలతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడానికి ప్రజలు ముందుకు రావాలని వామపక్ష నేతలు పిలుపునిచ్చారు. ప్రచార భేరి పాద యాత్ర సందర్భంగా సీపీఎం, సీపీఐ నాయకులు దుర్గానగర్, సుందరయ్య కాలనీలలో సోమవారం ప్రచారం చేశారు. సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజలు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఈ విధానాలను నిరసించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలవల్లే ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ధరలను తగ్గించడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి కార్మికవర్గాన్ని రోడ్డున పడేసిందన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంలేదని, పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడంలో జాప్యం చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం గాజువాక కార్యదర్శి ఎం.రాంబాబు, నాయకులు అప్పారి విష్ణుమూర్తి, గంగాధర రావు, డి.శ్రీనివాసరావు, ఎం.తాతాబాబు, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలి'

పెదగంట్యాడ: విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని సీపీఐ, సీపీఎం నాయకులు కోరారు. పెదగంట్యాడ జంక్షన్ నుంచి నెల్లిముక్కు మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలో పెంటమాంబ అమ్మవారి ఆలయం వరకు సోమవారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

25న శ్రీశ్రీపై క్విజ్ పోటీ

సీతంపేట: శ్రీశ్రీ జయంతి సందర్భంగా ఈ నెల 25వ తేదీ మంగళవారం సాయంత్రం 6 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శ్రీశ్రీ జీవితం, సమగ్ర సాహిత్యంపై క్విజ్ పోటీ నిర్వహించనున్నట్టు విశాఖ రసజ్ఞ వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు ఒక ప్రకటనలో తెలిపారు. రాత పరీక్ష ఉంటుందని, వన్ వర్డ్ ఆన్సర్స్ రూపంలో రాయాల్సి ఉంటుందన్నారు. 30 ఏళ్ల లోపు వారు(జూనియర్స్) ఒక విభాగం గాను, ఆపై వయస్సు ఉన్నవారు (సీనియర్స్) మరో విభాగం గాను పోటీ జరుగుతుందని చెప్పారు. రెండు విభాగాలకు విడివిడిగా ప్రథమ బహుమతి రూ.1,000, ద్వితీయ బహుమతి రూ.750 ప్రదానం చేస్తామన్నారు. ఈ నెల 30న ఆంకోశాలో జరగనున్న శ్రీశ్రీ జయంతి వేడుకల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోటీలో పాల్గొన దలచిన వారు వారి పేర్లను వాట్సాప్ ద్వారా ఈ నెల 20లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. డాక్టర్ డి.వి.సూర్యారావు 98851 88431, మేడా మస్తాన్‌రెడ్డి 94413 44365 నంబర్లకు వాట్సాప్ చేయాలని కోరారు.

చూడముచ్చటగా సీతకొండ

- గతంతో పోల్చుకుని సందర్శకుల హర్షం
- సుందరీకరణతో ఆకట్టుకుంటున్న వ్యూ



సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద కొండ వాలులో అస్తవ్యస్తంగా ఉన్న మట్టి, బండలు



సీతకొండ సీ వ్యూ పాయింట్ వద్ద కొండ వాలులో రాళ్లపై వేసిన పెయింటింగ్స్



శిథిలమైన పాత్‌వే



అభివృద్ధి చేసిన పాత్‌వే

ఆరిలోవ: శిథిలమైన కొండవాలు.. అస్తవ్యస్తంగా మట్టి, బండరాళ్లతో దర్శనమిచ్చే సీతకొండ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. చూడముచ్చటైన పెయింటింగ్స్‌తో కనువిందు చేస్తోంది. ఈ సీ వ్యూ పాయింట్ శిథిలావస్థకు చేరింది. ఇక్కడ ఫుట్‌పాత్‌లు, సముద్రం వైపు వ్యూ పాయింట్, కొండవాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. ఈ క్రమంలో జీ-20 సదస్సులో భాగంగా బీచ్ రోడ్డులో ఉన్న సీతకొండ సీ వ్యూ పాయింట్‌ను సుందరంగా తీర్చిదిద్ది వైఎస్సార్ సీ వ్యూ పాయింట్‌గా నామకరణం చేయడం తెలిసిందే. కొండవాలులో గతంలో ఎప్పుడు జారిపడతాయోనని భయభ్రాంతులను చేసిన బండ రాళ్లను సరిచేసి వాటికి పెయింటింగ్ వేశారు. పలకలు ఊడిపోయి పిచ్చి మొక్కలతో అస్తవ్యస్తంగా మారిన ఫుట్‌పాత్‌లను ఆధునికీకరించి తీర్చిదిద్దారు. వాటికి రక్షణ గోడ నిర్మించి మిలమిల మెరిసే పలకలు అమర్చారు. సీ వ్యూ పాయింట్‌లో విద్యుత్ బల్బులు, సోలార్ లైట్లతో కూడిన ట్రీ ఏర్పాటు చేశారు. దీంతో ఈ సీ వ్యూ పాయింట్ అందంగా మారింది. సందర్శకులను ఆకట్టుకుంటోంది. అప్పటికి, ఇప్పటికి ఎంత తేడా అంటూ సందర్శకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
పెందుర్తి
7997958341, 9912440606

రోల్ మోడల్‌గా యువత



ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: భవిష్యత్తు తరానికి ప్రస్తుత యువత రోల్ మోడల్‌గా నిలవాలని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. ఏయూ టీఎల్ఎన్ సభా మందిరంలో సోమవారం నిర్వహించిన ఐఏఎస్ఈ ఫ్రెషర్స్ డే వేడుకలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులుగా విద్యార్థులు మారాలని సూచించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజేతలకు వీసీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, విభాగ ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జోరుగా.. హుషారుగా



వెన్నలపాలెంలో సంక్షేమ పథకాల బ్రోచర్లతో నాయకులు



మొగలిపురంలో పథకాల బ్రోచర్ అందజేస్తున్న యడ్ల నాయుడు,ఐడీ బాబు తదితరులు

- **జగనన్నే మా భవిష్యత్తుకు అపూర్వ ఆదరణ**

పరవాడ: జగనన్నే మా భవిష్యత్- మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం పెందుర్తి నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. గడపలకు వెళుతున్న నాయకులకు ప్రజలు అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు తమకు భరోసా ఇచ్చాయని లబ్ధిదారులు చెప్పడంతో నాయకులు రెట్టించిన ఉత్సాహంతో కార్యక్రమంలో పాల్గొంటున్నారు.

- వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు మాసవరపు ముత్యాలునాయుడు, వెన్నల సింహాద్రి ఇంటింటికీ వెళ్లి జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. రానున్న కాలంలో పథకాలు అమలు కావాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకోవాలని ప్రజలను కోరారు.
- వాడచీపురుపల్లిలో గృహ సారథులు జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. పేదలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు.
- రావాడలో గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వారు పొందుతున్న లబ్ధిని వివరించారు. లబ్ధిదారులు స్వయంగా మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను తమ ఇళ్లపై అతికించుకోవడానికి ముందుకు వచ్చారు.

సబ్బవరం మండలంలో..

సబ్బవరం: మండలంలోని మొగలిపురంలో వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, పార్టీ అధికార ప్రతినిధి ఐడీ బాబు ఆధ్వర్యంలో పది రోజులుగా నిర్వహించిన మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ జగనన్న పాలన తీరుపై వారి అభిప్రాయాలను సేకరించారు. కుటుంబ సభ్యుల అనుమతితో మా నామ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లు అతికించారు. 1100 కుటుంబాలను కలిసి సుమారు 1,050కి పైగా మిస్డ్ కాల్స్ ఇచ్చి ప్రతి ఇంటివద్ద ఫోటో దిగారు.

- పైడివాడ అగ్రహారం గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.సచివాలయ కన్వీనర్ పెచ్చేటి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు,కార్యకర్తలతో కలిసి వలంటీర్లు,గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి కార్యక్రమం నిర్వహించారు.

అవగాహనతో అగ్నిప్రమాదాల నివారణ



ఆరిపాక పాఠశాలలో గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



ప్రమాద సమయంలో తప్పించుకోవడంపై విద్యార్థులకు మెళకువలు వివరిస్తున్న సిబ్బంది

సబ్బవరం: విద్యార్థులు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు మరింత మందికి అవగాహన కల్పించాలని సబ్బవరం అగ్నిమాపక అధికారి దిలీప్ కుమార్ కోరారు.జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తరచూ అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న అంశాలపై అగ్నిమాపక సిబ్బంది డెమో నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెళకువలను వివరించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్ మెన్ కె. అప్పలనాయుడు,డ్రైవర్ ఆపరేటర్ సీహెచ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణపై ద్వంద్వ వైఖరి తగదు



ధర్నా చేస్తున్న వామనమూర్తి తదితరులు

సీతంపేట: కేంద్ర ఉక్కు సహాయక మంత్రి ఫగాన్ సింగ్ కులస్తే ద్వంద్వ వైఖరి విడనాడాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నరసింహనగర్ కూడలిలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిలిపివేస్తామని, ప్లాంట్ అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ప్రకటించిన కేంద్ర మంత్రి.. సాయంత్రమయ్యే సరికి మాట మార్చేశారని మండిపడ్డారు. ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అని రెండేళ్లుగా చేస్తున్న నిరసనలు, ధర్నాలను విచ్ఛిన్నం చేయడానికే ఫగాన్ సింగ్ అటువంటి వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, ఐరన్‌ఓర్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రావికృష్ణ, కేలం శివ, కె.శ్రీను, పి.సాయికుమార్, జి.సూర్యారావు, డి.మహాలక్ష్మినాయుడు, బి.సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

795వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు



కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 795వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయడం తప్పదని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు చేయడం సరి కాదన్నారు. ఆ ప్రకటనలకు బెదిరేది లేదన్నారు. పోరాటం చేయడం ద్వారా ఉక్కు కార్మికుల పోరాట శక్తి దేశానికి తెలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన ఆలోచనను వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచి, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని ఆలయ అధికారులు తెలిపారు.

'అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ రద్దు చేయాలి'

డాబాగార్డెన్స్: మెడికల్ షాపులు, హాస్పిటల్స్, చిన్న చిన్న కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌పై జీవీఎంసీ భారీగా విధించిన అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ ఉపసంహరించాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి. గంగారావు కోరారు. ఈ మేరకు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా అత్యవసర సర్వీసులపై కూడా అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికే ఆ సంస్థలపై జీవీఎంసీ భారీగా ఆస్తిపన్ను విధించిందని, వాటర్ చార్జీలు పెంచడంతో పాటు ట్రేడ్ లైసెన్స్ రెండు రెట్లు పెంచిందని తెలిపారు. జీవీఎంసీ పరిధిలో అడ్వర్టయిజ్‌మెంట్ ట్యాక్స్ విధించడంలో, వసూళ్లలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. దీనివల్ల జీవీఎంసీ కోట్లాది రూపాయలు కోల్పోతుందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి
9912222753
Office mail : sakshiadvtvsp@gmail.com